క్లుప్తంగా

నేటి నుంచి శరన్నవరాత్రి, బతుకమ్మ వేడుకలు

నల్లకుంట: నల్లకుంట శివం ప్రాంగణంలో ఆదివారం (నేటి) నుంచి 24వ తేదీ వరకు సాయి శరన్నవరాత్రి బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని సత్యసాయి సేవా సంస్థలు హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎ. మల్లేశ్వర రావు ఓ ప్రకటనలో తెలిపారు. సత్యసాయి సేవా సంస్థలు హైదరాబాద్ జిల్లా, అంబర్‌పేట, ఎస్ఆర్ నగర్ సత్యసాయి సేవా సంస్థలు సంయుక్తాధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో అమ్మవారు నిత్యం ఒక అలంకరణలో దర్శనమిస్తారన్నారు. అలాగే సత్యసాయి సేవా సంస్థలు మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ప్రారంభమయ్యే వేడుకల్లో 108 జంటల దంపతులు పాల్గొంటారని చెప్పారు.

కిషన్‌రెడ్డిపై విమర్శలు తగవు

కాచిగూడ: కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిపై విమర్శలు చేసే నైతిక అర్హత ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు లేదని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. అంబర్‌పేటలో బీఆర్ఎస్ గెలిచిన తర్వాత అవినీతి పరాకాష్టకు చేరిందని, ఆరాచకం కొనసాగుతుందని ఆరోపించారు. విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లి, ప్రలోభాలతో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు ప్రయత్నిస్తున్న కాలేరు వెంకటేష్‌కు ఓటమి ఖాయమని గ్రహించి అనుచిత విమర్శలు చేస్తున్నారన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై విమర్శలు చేయడం తగదన్నారు.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న రామరాజు వర్మ

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.రామరాజు వర్మను నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య శనివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామరాజు వర్మ మాట్లాడుతూ.. ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టే అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయడానికి అందరితో కలిసి పనిచేస్తానన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



అంబర్‌పేట: అంబర్‌పేట మహంకాళి ఆలయం వద్ద జరిగే శరన్నవరాత్రుల వేడుకలకు రావాలని దేవస్థాన సేవ సమితి ప్రతినిధులు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు ఆహ్వాన పత్రం అందజేశారు. శనివారం ఆయన నివాసంలో కలిసి 10 రోజుల పాటు జరిగే వేడుకలకు ఆహ్వానించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో దేవస్థాన సేవ సమితి చైర్మన్ పి.జ్ఞానేశ్వర్ గౌడ్, ప్రతినిధులు శంకర్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్ ఉన్నారు.

స్టీఫెన్ రవీంద్రపై రేవంత్‌రెడ్డి ఆరోపణలు తగవు



ముషీరాబాద్: సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలు తగవని క్రిస్టియన్ సేవా సంఘ్ సంస్థ అధ్యక్షుడు డేవిడ్‌రాజ్, సంస్థ న్యాయ సలహాదారులు సుధీర్ పేర్కొన్నారు. రాంనగర్‌లో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ, స్టీఫెన్ రవీంద్ర క్రిస్టియన్ మైనార్టీ వర్గానికి చెందిన అధికారి కాబట్టి రేవంత్‌రెడ్డి ఆయనపై ఆరోపణలు చేశారన్నారు. క్రైస్తవ వర్గాన్ని రేవంత్‌రెడ్డి టార్గెట్ చేస్తూ రెడ్డి కుల అహంకారం ప్రదర్శిస్తున్నారని వారు ఆరోపించారు. స్టీఫెన్ రవీంద్ర ఎన్నికల నిబంధనల ప్రకారం విధులు నిర్వహిస్తున్నారు తప్ప ఏ పార్టీకి అనుకూలం కాదని వారన్నారు. ఆయనపై రేవంత్ చేసిన ఆరోపణలు వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో క్రైస్తవ సంఘాలతో కలిసి గాంధీభవన్‌ను ముట్టడిస్తామన్నారు.

జక్కుల విజ్ఞతకు అబ్దుల్ కలాం స్మారక అవార్డు

కాచిగూడ: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్మారక అవార్డుకు ప్రముఖ విద్యావేత్త జక్కుల విజ్ఞత ఎంపికైనట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ తెలిపారు. అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీన నిర్వహించే కార్యక్రమంలో జక్కుల విజ్ఞతకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నందా చేతుల మీదుగా అవార్డును అందజేస్తారన్నారు.

తీరొక్క పూలు తెచ్చి.. బతుకమ్మను పేర్చి

అట్టహాసంగా బతుకమ్మ సంబురాలు ప్రారంభం



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



జైస్వాల్ గార్డెన్‌లో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న మహిళలు

నల్లకుంట: నల్లకుంట లింగాల గడ్డ శివాలయం సమీపంలోని సెయింట్ మేరీ హైస్కూల్‌లో శనివారం ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. వేడుకల్లో కరస్పాండెంట్ వెంకట్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు స్వరూప, మాయ, సరిత, దీపాలు, అర్చన పాల్గొన్నారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఎంగిలి బతుకమ్మగా కొలుస్తూ ఉత్సవాలు నిర్వహించారు. రంగు రంగుల పూలతో రూపొందించిన బతుకమ్మలను ఒక్కచోటికి పేర్చారు. 'చిత్తు చిత్తులబొమ్మ శివుని ముద్దులగుమ్మ... బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో' అంటూ వాటి చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ, దాండియా, కోలాటం వంటివి ఆడుతూ మహిళలు, యువతులు సందడి చేశారు.

జాహ్నవి కాలేజీలో..

కాచిగూడ: నారాయణగూడలోని జాహ్నవి మహిళా డిగ్రీ, పీజీ కాలేజీలో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైస్ చైర్మన్ ఎ.లక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను విద్యార్థినులకు తెలియజేసేందుకు ప్రతి ఏటా బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ఒక్క చోటకు చేర్చి వాటి చుట్టూ బతుకమ్మ పాటలు పాడుతూ, దాండియా నృత్యాలతో ఆకట్టుకున్నారు.

అంబేద్కర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో...

బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ సంబురాలను కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. బతుకమ్మల చుట్టూ విద్యార్థులు తిరుగుతూ ఆట పాటలతో అలరించారు. అంబేద్కర్ విద్యా సంస్థల కార్యదర్శి జి.వినోద్‌కుమార్, ఇండియన ప్లే బ్యాక్ సింగర్ మైనంపాటి శ్రీరామచంద్ర, కళాశాల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.





సుందరయ్య పార్కులో బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్న జాహ్నవి విద్యా సంస్థల విద్యార్థులు



బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థులు

డాక్టర్ లక్ష్మణ్ అరెస్టుపై బీజేవైఎం నిరసన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గ్రూప్–2 విద్యార్థిని ప్రవల్లిక ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని తెలుసుకున్న రాజ్యసభ సభ్యుడు, జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పరామర్శించడానికి వెళ్లగా పోలీసులు అరెస్టు చేసి ఉదయం 4 గంటల వరకు స్టేషన్‌లో ఉంచడాన్ని నిరసిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ క్రాస్ రోడ్ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి అరెస్టులను సహించబోమని చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి వద్ద నిరసన వ్యక్తం చేశారు బీజేవైఎం ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గడ్డం నవీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె.రవిచారి, బీజేవైఎం మాజీ అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్, వెంకటేష్, బీఎస్ రెడ్డి, సాయిచంద్, భాస్కర్‌గౌడ్, గౌరీశంకర్, సంతోష్ పాల్గొన్నారు.



ఏసీపీ యాదగిరి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేవైఎం కార్యకర్తలు

'ప్రవల్లిక మరణం ప్రభుత్వ హత్యనే'



అనిల్‌కుమార్ యాదవ్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

ముషీరాబాద్: అశోక్‌నగర్‌లో శుక్రవారం జరిగిన వరంగల్ జిల్లాకు చెందిన గ్రూప్–2 అభ్యర్థిని ప్రవల్లికది ఆత్మహత్య కాదని, ప్రభుత్వ హత్యేనని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్ ఆరోపించారు. శనివారం సాయంత్రం ఇందిరాపార్కు వద్ద ప్రవల్లిక ఆత్మహత్య ఘటనను నిరసిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన చేయడానికి కాంగ్రెస్ నాయకులు రాగా, ఎలాంటి అనుమతులు లేవంటూ పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు కాంగ్రెస్ నేతలు పోలీసులకు మధ్య వాగ్వాదం, తోపులాట జరగడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ, విద్యార్థిని ప్రవళిక ఆత్మహత్యకు నిరసనగా శాంతియుతంగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తుంటే పోలీసులు అడ్డుకొని అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ఆత్మహత్య కేసును పక్కదారి పట్టించేందుకు పోలీసులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రవల్లిక ఆత్మహత్య కేసును పారదర్శకంగా విచారణ చేసి ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు భాస్కర్, మేడి సురేష్‌తోపాటు పెద్ద సంఖ్యలో విద్యార్థి, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాచిగూడ: ప్రవల్లిక మృతి ప్రభుత్వ హత్యేనని, నిరుద్యోగులంతా ఆత్మహత్యలకు పాల్పడకుండా మోసం చేస్తున్న బీఆర్ఎస్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వలీ ఉల్లాఖాద్రీ, ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర పేర్కొన్నారు. శనివారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ వై జంక్షన్ కూడలి వద్ద సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆరు వేలకు పైగా నిరుద్యోగులు, విద్యార్థులు, కార్మికులు, కర్షకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో పోటీ పరీక్షలకు జిల్లాల నుంచి నగరానికి వచ్చి శిక్షణ తీసుకుంటున్న నిరుద్యోగులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత పాలకులదని, కానీ నిర్లక్ష్యపు విధానాల కారణంగా తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ లోపాల కారణంగా అన్ని పోటీ పరీక్షలు రద్దు కావడం, వాయిదా పడటంతో నిరుద్యోగులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. నిరుద్యోగులను మోసం చేస్తున్న బీఆర్ఎస్‌కు ఇవే చివరి ఎన్నికలు అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, శంకర్, యుగంధర్, రామకృష్ణ, షేక్ మహమూద్, మాజీద్, ఉపేందర్, శ్రీనాథ్, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు ఐదు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలి

- కాంగ్రెస్ అధిష్టానానికి బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్

ముషీరాబాద్: బ్రాహ్మణులకు కాంగ్రెస్ పార్టీ 5 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.సుధాకర్ ఆ పార్టీ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. బ్రాహ్మణుల డిమాండ్లను అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చి వాటి అమలుకు హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

శనివారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బ్రాహ్మణులు గ్రేటర్ హైదరాబాద్‌లోని ముషీరాబాద్, అంబర్‌పేట, శేరిలింగంపల్లి, మహేశ్వరం, మల్కాజిగిరి, ఎల్‌బీనగర్, ఖైరతాబాద్, హన్మకొండ, మంథని నియోజకవర్గాలలో అధిక సంఖ్యలో ఉన్నారని, ఈ సీట్లను బ్రాహ్మణులకు కేటాయించాలన్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ జాబితాను ప్రకించి బ్రాహ్మణులకు ఒక ఎమ్మెల్యే, రెండు ఎమ్మెల్సీలతో పాటు కార్పొరేషన్ పదవీ ఇచ్చిందన్నారు. కాంగ్రెస్‌పార్టీ మాత్రం బ్రాహ్మణులను అంటరానివారిగా చూస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో బ్రాహ్మణ సీనియర్లు పని చేస్తున్నారని వారికి అవకాశం కల్పించేందుకు పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఇన్‌ఛార్జి మాణిక్‌ఠాకూర్, రాహుల్‌గాంధీ చర్యలు తీసుకోవాలన్నారు. ముషీరాబాద్, అంబర్‌పేట సీట్లలో బ్రాహ్మణులకు కాంగ్రెస్ అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను మేనిఫెస్టోలో చేర్చాలి

కాచిగూడ: తెలంగాణలో జర్నలిస్టులకు సంబంధించిన పలు సమస్యలను అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ ఎన్నికల్లో తాము అధికారంలోకి రాగానే ఆయా సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికార బీఆర్ఎస్ పార్టీతో సహా అన్ని ప్రధాన ప్రతిపక్ష పార్టీలు జర్నలిస్టుల సమస్యలను మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలను మేనిఫెస్టోలో చేర్చి పరిష్కరిస్తామని కచ్చితమైన హామీ ఇచ్చిన పార్టీలకు జర్నలిస్టులు మద్దతు ఇవ్వాలని సూచించారు.

వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం

ముషీరాబాద్: రాంనగర్ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం రాంనగర్ చౌరస్తాలో పేదలకు అన్నదానం చేశారు. సంస్థ కన్వీనర్ రాజశేఖర్‌గుప్తా, అధ్యక్షుడు వాడకట్టు రాజు గుప్తా, ప్రధాన కార్యదర్శి చెల్లా శివకుమార్ గుప్తా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి నెలా అమావాస్య రోజున 500 మందికి అన్నదానం చేస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి గంగి శ్రీనివాస్, రాంనగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వి.సుధాకర్ గుప్తా, అనంతుల ఆంజనేయులు, కూర యాదగిరి, బుక్క రమేష్, ప్రభాకర్, మేడి సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్, ఎర్రం శేఖర్, గంజి శశి కుమార్, సత్యవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లర రాజకీయాలు విడనాడాలి: బీఆర్ఎస్

ముషీరాబాద్: పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువత మనోధైర్యాన్ని దెబ్బతీసేలా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నాయని బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ నాయకుడు ఎంఎన్ శ్రీనివాస్‌రావు ఆరోపించారు. చనిపోయిన వాళ్ల కుటుంబ సభ్యులకు సానుభూతి తెలపాల్సింది పోయి కొంత మంది కాంగ్రెస్, బీజేపీ నాయకులు యువతను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఒక ప్రకటనలో మండిపడ్డారు. పోటీ పరీక్షలు తాత్కాలికంగా వాయిదా పడితే యువత నిరాశకు లోను కావద్దని, రాజకీయ పార్టీల నాయకుల మాటలు నమ్మవద్దని కోరారు. రోజు రోజుకూ దిగజారుతున్న పరిస్థితి నుంచి బయట పడేందుకు బీజేపీ నాయకులు ఎంతకైనా తెగిస్తున్నారని, దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువత మనోధైర్యాన్ని కోల్పోవద్దని, కొద్ది రోజులు అటూ ఇటూ అయినా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అశోక్‌నగర్‌లో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువత ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని, తల్లిదండ్రులను శోకానికి గురి చేయడం సరి కాదన్నారు.

బీజేపీలో చేరిక

అంబర్‌పేట: సీనియర్ నాయకులు కెంచె చంద్ర శేఖర్ తిరిగి బీజేపీ గూటికి చేరారు. శనివారం అంబర్‌పేట కార్యకర్తల సమావేశానికి హాజరైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో ఆయన పార్టీలో చేరారు.

ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం ఇవ్వాలి

జంగ్ 2023 తెలంగాణ



ముసాయిదాను ఆవిష్కరిస్తున్న అతిథులు

కాచిగూడ: నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలు పరిష్కరించిన పార్టీలకే అసెంబ్లీ ఎన్నికలో యువత ఓట్లు వేసి గెలిపిస్తుందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వలీ ఉల్లాఖాద్రీ, ప్రధానకార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు నిరుద్యోగులు, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ఆయా పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో యువజన భవిష్యత్ ఎన్నికల ముసాయిదా ప్రణాళికను వారు ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. దేశ ప్రజాస్వామ్యం పట్ల విద్యార్థులు, యువత పూర్తి విశ్వాసంతో ఉన్నారన్నారు. ఎన్నికల్లో డబ్బు దుర్వినియోగం పెరిగిపోయిందని అవినీతి రహిత రాజకీయ వ్యవస్థ కోసం అన్ని రకాల దోపిడీలకు వ్యతిరేకంగా యువజన సమాఖ్య పోరు కొనసాగిస్తుందన్నారు. ఉపాధి హక్కు చట్టంగా పిలువబడే నూతన సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని, పార్లమెంట్, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి యువతకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, శంకర్, యుగంధర్, రామకృష్ణ, షేక్ మహమూద్, మాజీద్, ఉపేందర్, శ్రీనాథ్, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

'ప్రజలు మార్పు కోరుకుంటున్నారు'



మాట్లాడుతున్న డీఎస్ రెడ్డి

చిక్కడపల్లి: ముషీరాబాద్ నియోజకవర్గ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకుడు డీఎస్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగకపోవడమే దీనికి కారణమన్నారు. గాంధీనగర్‌లోని తన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో అభివృద్ధి అంతంత మాత్రమే జరిగిందని, నేటికీ డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థలు సరిగా లేవన్నారు. ఇప్పటికీ డివిజన్లలోని కొన్ని బస్తీలు, కాలనీల్లో సరైన రోడ్లు లేవన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిధులతో నియోజవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యకర్తలు, నాయకులు కష్టపడి పని చేస్తే ముషీరాబాద్‌లో బీజేపీ జెండా ఎగురుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని టీపీసీసీ పదవి నుంచి తొలగించాలి



నీరడి భూపేష్ సాగర్

కాచిగూడ: అగ్రకుల అహంకారం, డబ్బుమదంతో బీసీలను అవమానిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని వెంటనే అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నీరడి భూపేష్ సాగర్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ అధినేత్రి సోనియాగాంధీ, రాహుల్ గాంధీలకు లేఖలు రాసినట్లు పేర్కొన్నారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి తక్షణమే బీసీలకు క్షమాపణ చెప్పాలన్నారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు, బీసీ నేత పొన్నాల లక్ష్మయ్య పట్ల రేవంత్‌రెడ్డి అనుచితంగా వ్యవహరించి అవమానించే విధంగా మాట్లాడి వ్యవహరించడం పట్ల బీసీలందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరూ మాట్లాడినా ఆయా పార్టీల నేతలకు బీసీలు గుణపాఠం చెబుతారన్నారు.

బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వని పార్టీలను ఓడిస్తాం

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 50శాతం టికెట్లు ఇవ్వని పార్టీలను ఓడిస్తామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అన్ని రాజకీయ పార్టీలు అసెంబ్లీ ఎన్నికల్లో 50 శాతం టికెట్లు ఇవ్వాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనగణనలో బీసీ కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుండి 52 శాతంకు పెంచాలని, ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా పెట్టాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకతీతంగా అన్ని పార్టీల నేతలు బీసీ బిల్లు కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, కోలా జనార్ధన్, నీల వెంకటేష్, కె.రామరాజు వర్మ, హనుమంతరావు, మారేష్, అంజి, నందగోపాల్, వేముల రామకృష్ణ, హేమంత్ కుమార్, శ్రీదేవి, సుధాకర్ పాల్గొన్నారు.

శంకరమఠంలో శారదాంబకు మహాభిషేకం



నల్లకుంట: నల్లకుంటలోని శంకరమఠంలో శనివారం ఉదయం పండితుల మంత్రోచ్చారణల నడుమ శారదాంబ మూల విరాట్‌కు మహాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారు జగత్ ప్రసూతిక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం శాంకరీ నాట్యస్థల్ గురువు విజయవల్లి భరద్వాజ్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది.

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

ఆదివారం (నేడు) నుంచి శారదా శరన్నవరాత్ర మహోత్సవాలు ప్రారంభమవుతాయని శంకరమఠం నల్లకుంట బ్రాంచ్ హెడ్ కె. కృష్ణా రావు తెలిపారు. ఈ సందర్భంగా శరదాంబ బ్రాహ్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తుందన్నారు. సాయంత్రం మద్దూరి వేణుగోపాల్ బృందంచే నాదస్వర కచేరి, కొమరవోలు శివ ప్రసాద్‌చే గళమురళీ విన్యాసం(ఈల పాట సంగీతం) ఉంటుందని అనంతరం బ్రహ్మశ్రీ విశ్వనాథ గోపాల కృష్ణశాస్త్రిచే దేవీ భాగవత ప్రవచనం ఉంటుందన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు 'కాషాయ' పార్టీని నిర్మూలించాలి



మాట్లాడుతున్న సీపీఐ నేత ఈటీ నరసింహ

కాచిగూడ: ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాషాయ పార్టీని నిర్మూలించాల్సిన అవసరం ఉందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నరసింహ అన్నారు. శనివారం హిమాయత్‌నగర్ సత్యనారాయణ రెడ్డి భవన్‌లో సీపీఐ హైదరాబాద్ జిల్లా విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ తమ ఎజెండాను ముందుకు తీసుకురావాలని బీజేపీని బలవంతం చేస్తుందని, ఇందులో భాగంగానే దేశంలో దళితులు, మైనార్టీలు, మహిళలపై దాడులు పెరిగి పోతున్నాయన్నారు. మోదీ ప్రభుత్వం బడా కార్పొరేట్ సంస్థలతో జతకట్టి ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి ప్రైవేటీకరణ బాటలు వేస్తూ పౌరులకు ఉద్యోగ, సామాజిక రక్షణ లేకుండా చేస్తుందని ఆయన దుయ్యబట్టారు. కార్యక్రమంలో పార్టీ నేతలు జి.చంద్రమోహన్, ఎస్.ఛాయాదేవి, కమతం యాదగిరి, బి.స్టాలిన్, పడాల నళిని, శ్రీనివాస్, శ్రీకాంత్, ఓమర్‌ఖాన్, వెంకటస్వామి, చైతన్య, పాల్గొన్నారు.

కొమురం భీమ్ స్ఫూర్తితోనే ఆదివాసీ పోరాటాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కొమురం భీమ్ స్ఫూర్తితోనే ఆదివాసీ, గిరిజనులు తమ మనుగడ కోసం నేడు పోరాటం చేస్తున్నారని ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాషువా పూలే, పేరియార్, లెటర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోమురం భీమ్ పుస్తకావిష్కరణ సభ జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొ. హరగోపాల్ మాట్లాడుతూ, ఆదివాసీ, గిరిజనుల జీవితాలు మనుపెన్నడు లేనంత దుర్భరంగా మారాయన్నారు. దేశ పాలకులు కనిజ వనరులను బహుళ జాతి కంపెనీలకు అప్పగించేందుకు అన్ని అటవీ సంరక్షణ చట్టాలను కాలరాస్తూ వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ కవి, పాత్రికేయుడు బి.విల్సన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ పౌర హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణ, ప్రొ. భంగ్యాభూక్యా, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వరరావు, పుస్తక రచయిత భూపాల్, హైదరాబాద్ బుక్ ట్రస్ట్ నిర్వాహకులు గీతారామస్వామి పాల్గొన్నారు.

